సాక్షి
ప్రకాశం
ఆదివారం । 31 । మార్చి । 2024



వైఎస్సార్ సీపీలోకి ముస్లింలు

ఒంగోలు నగరంలోని ఇస్లాంపేటకు చెందిన ముస్లిం కుటుంబాలు శనివారం సాయంత్రం బాలినేని, చెవిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. - IIలో..



ఎమ్మెల్యేవా.. దామచర్ల బానిసవా

కొండపి ఎమ్మెల్యే డోల బాల వీరాంజనేయ స్వామి దామచర్ల కుటుంబానికి బానిసలా పడిఉన్నారని మంత్రి ఆదిమూలపు సురేష్ ఎద్దేవా చేశారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
36.5/25.7

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఆదివారం - ఇఫ్తార్ : సా॥ 6.27
సోమవారం - సహరీ : ఉ॥ 4.43



న్యూస్‌రీల్

ఎస్సీ వర్గీకరణ పేరుతో జాతిని తాకట్టు పెట్టారు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఒంగోలు సెంట్రల్: మూడు దశాబ్దాల ఎమ్మార్పీఎస్ ఉద్యమ పోరాటాన్ని, తన లక్ష్యాలను సాధించుకునే దిశగా ప్రయాణించకుండా తన వ్యక్తిగత స్వార్థం కోసం జాతిని రాజకీయంగా, ఆర్థికంగా నిర్వీర్యం చేసేలా రాష్ట్ర ఎన్నికల్లో జరుగుతోందని, దీనిని గమనించి అప్రమత్తంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో పనిచేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. అంబేడ్కర్ భవన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రావి నూతల కోటి మాదిగ మాట్లాడుతూ పేమెంట్ ఉద్యమకారులతో ఉద్యమాలు నడుపుతూ వ్యక్తిగత స్వార్థం, ఆర్థిక అభివృద్ధి కోసం మాదిగ జాతిని బలి పశువులుగా చేస్తున్న వాస్తవాలు గ్రహించాలని విన్నవించారు. ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించకుండా సుప్రీం కోర్టుకు పంపటం ఎందుకని, బీజేపీ వర్గీకరణ విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. వర్గీకరణ పేరుతో మాదిగ జాతిని రాజకీయంగా, ఆర్థికంగా తన కబంద హస్తాల్లో ఉన్నట్లు చేస్తున్న నాయకునికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నెనుదుపల్లి జయరాజ్ మాదిగ అన్నారు. ఆలూరి చిరంజీవి, అత్తుల శరత్, పల్లి పోగు త్రిపుర, రేణమాల మాధవ్, మల్లెల ప్రసాద్ గౌడ్ , అనిల్, నాగయ్య, శ్యాంసన్, రాజు, నాగార్జున, చిన్న ఏసుబాబు, వెంకటేష్, మోజేష్, రవి, వినోద్ పాల్గొన్నారు.

చంద్రబాబు పాలన పశ్చిమ ప్రకాశానికి శాపంగా మారింది. వైఎస్సార్ సీపీకి కంచుకోటగా మారిన పశ్చిమ ప్రకాశాన్ని అభివృద్ధి, సంక్షేమంలో నిర్లక్ష్యం చేశారు. అధికారం కోల్పోయే సరికి కపట ప్రేమ ఒలకబోస్తున్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లు ఈ ప్రాంతం వైపు కన్నెత్తి చూడని బాబు.. ఈ మధ్య కాలంలో కాళ్లకు బలపం కట్టుకుని తిరుగుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పశ్చిమం వైపు ప్రత్యేక దృష్టి సారించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న వెలిగొండను పూర్తి చేసి ప్రజల కలను సాకారం చేశారు. అందనంత దూరంలో ఉన్న వైద్యసేవలను మెడికల్ కళాశాలతో పాటు జిల్లా ఆస్పత్రి రూపురేఖలు మార్చేసి అత్యాధునిక వైద్యం అందుబాటులోకి తెచ్చారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించారు. మరో వైపు సంక్షేమాన్ని ఉద్యమంగా సాగించారు. ఈ పరిస్థితులతో టీడీపీ తుడిచిపెట్టుకుని పోతుండడంతో ఉనికిని కాపాడుకునేందుకు తరచూ పశ్చిమ ప్రకాశం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు చంద్రబాబు.

- కన్నెత్తి చూడని పశ్చిమ ప్రకాశంలో తరచూ చక్కర్లు
- అధికారంలో ఉన్నప్పుడు నిర్లక్ష్యం
- ప్రతిపక్షంలో కపట ప్రేమ
- చంద్రబాబు హయాంలో క్షామం, జగన్ హయాంలో క్షేమం
- నాడు వెలిగొండపై ఉత్తుత్తి హామీ, జగన్ పాలనలో నెరవేరిన కల
- నాడు విద్యా వైద్యంపై నిర్లక్ష్యం, నేడు ఇంటి ముంగిటకే వైద్యం
- పశ్చిమ ప్రకాశం అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి



మోసాల చంద్రం
మళ్లొస్తున్నాడహో..

మార్కాపురం:

నాడు... చంద్రబాబు, కరువు కవలలు అనడంలో ఎలాంటి సందేహం లేదు. 2014 నుంచి 2019 వరకూ ఐదేళ్ల బాబు పాలనలో పశ్చిమవాసుల కష్టాలు అన్నీ..ఇన్నీ కావు. సీఎం హోదాలో ఈ ప్రాంతం వైపు కన్నెత్తి చూడలేదు సరికదా..అబద్ధపు హామీలతో మోసం చేశారు. వరప్రదాయని వెలిగొండపై ఆయన ఎన్నో మాయమాటలు చెప్పారు. కరువు కాటకాలతో పంటలు పండక, గిట్టుబాటు ధరలు లేక, కల్తీ విత్తనాలు, నకిలీ ఎరువులతో, చాలీచాలని పింఛను, వైద్యం అందక ప్రజల బాధలు వర్ణనాతీతం. సీఎం హోదాలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ఐదు సార్లు వచ్చిన చంద్రబాబు పశ్చిమ ప్రకాశం పై కన్నెత్తి చూడలేదు. జిల్లా కొచ్చినప్పుడల్లా వెలిగొండ నీళ్లు ఇస్తామంటూ ఉత్తుత్తి హామీలు ఇచ్చి వెళ్లేవారు. వైఎస్సార్ సీపీకి కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. అభివృద్ధి ఊసే లేకుండా చేశారు.

నేడు.. పశ్చిమ ప్రకాశంపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వెనుకబడిన ప్రాంతంలో అభివృద్ధి పరుగులు తీయించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఈ ప్రాంత వాసుల సుదీర్ఘ కల వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయించారు. ఇటీవలే జాతికి అంకితం చేశారు. జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ఉన్నా మార్కాపురంలో రెండో కళాశాలకు అనుమతినిచ్చి ఈ ప్రాంతంపై అభిమానాన్ని చూపారు సీఎం. అలాగే మార్కాపురంలోని జిల్లా వైద్యశాల రూపురేఖలు మార్చేశారు. అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చారు. వైద్యుల ఖాళీలను భర్తీ చేశారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న ఇక్కడ 50 మందికి పైగా వైద్యులను నియమించారు. దోర్నాలలో గిరిజన సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం, ఒకటేమిటి వెనుకబడిన పశ్చిమ ప్రకాశం ఇప్పుడు జిల్లాకే అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తోంది. విద్య, వైద్యం పేదల ముంగిటకొచ్చింది. విత్తనాలు కావాలంటూ రోడ్డెక్కిన రైతులు, కల్తీ మందులంటూ మొర పెట్టుకునే అన్నదాతలు ఐదేళ్లలో ఎక్కడా కనిపించలేదు.



వెలిగొండపై నాడు..నేడు

బాబు హయాంలో 2014 నుంచి 2019 వరకు బడ్జెట్ ఇలా

2014-15లో	రూ.76.58 కోట్లు
2015-16లో	రూ.153.89 కోట్లు
2016-17లో	రూ.200 కోట్లు
2017-18లో	రూ.200 కోట్లు
2018-19లో	రూ.334.05 కోట్లు

ఈ విధంగా బడ్జెట్ కేటాయించినా 2014-18 మధ్య వెలిగొండకు రూ.600 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు.

వైఎస్ఆర్ ప్రభుత్వంలో ఇలా..

ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు దాదాపు రూ.5,974.21 ఖర్చు చేసింది. ఇందులో పనులకు రూ.822.05 కోట్లు, భూ సేకరణకు రూ.79.21 కోట్లు, పునరావాస కల్పనకు రూ.76.73 కోట్లు, ప్రాజెక్టు నిర్మాణానికి రూ.978.02 కోట్లు ఖర్చు చేశారు.

శర వేగంగా పునరావాస పనులు

వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాలైన కలనూతల వారికి ఇడుపూరు-1, 2లో, గుండంచెర్ల నిర్వాసితులకు తోకపల్లి వద్ద, సుంకేసుల గ్రామస్తులకు గొగులదిన్నె వద్ద, గొట్టిపడియ, అక్కచెరువు గ్రామస్తులకు వేములకోట వద్ద, సాయిరాం నగర్, రామలింగేశ్వరపురం వాసులకు ఓందుట్ల వద్ద పునరావాస పనులు జరుగుతున్నాయి. ఇదే సమయంలో గొట్టిపడియ వద్ద వెలిగొండ నీటిని మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాల్లో ప్రజలకు అందించేందుకు ఇన్‌టెక్ ట్యాంక్ పనులు వేగంగా చేస్తున్నారు.



ఆధునికీకరించిన మార్కాపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి



శరవేగంగా నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ

- మార్కాపురంలో మెడికల్ కాలేజీ
- పెద్ద దోర్నాలలో గిరిజన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి
- పొదిలిలో పెద్ద చెరువుకు రూ.50 కోట్లు మంజూరు
- మార్కాపురంలో నీటి ఎద్దడి నివారణకు రూ.25 కోట్లు కేటాయింపు

జిల్లాలో వెనుకబడిన ప్రాంతంగా పశ్చిమ ప్రకాశంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రద్ధ చూపుతున్నారు. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా పోలవరంతో సమానంగా వెలిగొండ ప్రాజెక్టు పనులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పనులు పూర్తిచేసి జాతికి అంకితం చేశారు.

మార్కాపురంపై..
డివిజన్ కేంద్రమైన మార్కాపురం నియోజకవర్గంలో అన్ని విభాగాల్లో కలిపి దాదాపు రూ.800 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ముఖ్యంగా మార్కాపురం పట్టణంలో రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీ పనులు సాగుతుండగా జిల్లా వైద్యశాలలో సుమారు రూ.10 కోట్లకు పైగా నిధులు కేటాయించారు. అత్యాధునిక వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. పశ్చిమ ప్రకాశంలోని మూడు నియోజకవర్గాల్లో శాశ్వతంగా కరువు నివారించేందుకు గొట్టిపడియ దగ్గర రూ.1230 కోట్లతో ఇన్‌టెక్‌వెల్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఇక్కడి నుంచి వెలిగొండ నీటిని 3 నియోజకవర్గాల్లోని ప్రజలకు అందిస్తారు. ఇక పొదిలిలో సాగర్ నీటిని ప్రజలకు అందించేందుకు పెద్ద చెరువు అభివృద్ధి కోసం రూ.55 కోట్లు కేటాయించారు. పనులు వేగంగా జరుగుతున్నాయి. మార్కాపురం పట్టణంలో శాశ్వతంగా తాగునీటి సమస్య నివారణకు రూ.25 కోట్లు కేటాయించారు. వీటితో పాటు మార్కాపురంలో రూ.2 కోట్లతో షాదీఖానా, మార్కాపురం టౌన్, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం జరిగాయి. ఇంక రైతు భరోసా కేంద్రాలు గ్రామ సచివాలయాలు 90 శాతం పూర్తయ్యాయి.

వైపాలెం అంటే అభిమానం
యర్రగొండపాలెం నియోజకవర్గంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక అభిమానం. ఎక్కువగా గిరిజనులు ఉండడంతో నియోజకవర్గంలోని పెద్ద దోర్నాలలో రూ.50 కోట్లతో గిరిజన సూపర్ స్పెషాలిటీ వైద్యశాల మంజూరు చేశారు. అలాగే పుల్లలచెరువులో తాగునీటి సమస్య నివారించేందుకు వెలిగొండ ప్రాజెక్టు కాలువ ఎక్స్‌టెన్షన్, టీ-5కు రూ.82 కోట్లు కేటాయించారు. గిద్దలూరు నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ వ్యవసాయ ల్యాబ్‌ను మంజూరు చేయడంతో నగర పంచాయతీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నిధులు కేటాయించారు. గిద్దలూరులో వైద్యశాలను ప్రారంభించారు,

వైద్య రంగంలో ఇలా..
టీడీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన వైద్య రంగానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జీవం పోసింది. నాడు టీడీపీ హయాంలో జిల్లా వైద్యశాలలో కేవలం ఎనిమిది మంది మాత్రమే డాక్టర్లు ఉండగా ప్రస్తుతం 50 మంది డాక్టర్లు సేవలందిస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో జిల్లా వైద్యశాల అభివృద్ధికి దాదాపు రూ.12 కోట్లు కేటాయించడంతో వైద్యశాల అభివృద్ధి చెందింది. నాడు నాణ్యమైన వైద్యం కోసం వైద్యశాలకు పోతే తాత్కాలిక చికిత్స చేసి గుంటూరుకు వెళ్లమనేవారు. నేడు ఆధునిక వైద్యసేవలు జిల్లా వైద్యశాలలోనే అందుతున్నాయి. రాయవరం దగ్గర రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి.

ఉమ్మడి ప్రకాశంలో వైఎస్సార్ సీపీ క్లీన్ స్వీప్

- 9న వైఎస్సార్ సీపీ మ్యానిఫెస్టో విడుదల
- జగన్ చెప్పాడంటే చేస్తాడంతే అనే నమ్మకం ప్రజల్లో ఉంది
- చంద్రబాబులా మభ్యపెట్టే హామీలు ఇవ్వం
- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



అంబేడ్కర్ కాలనీలో ర్యాలీగా ఇంటింటికీ తిరుగుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి



17వ డివిజన్ అంబేడ్కర్ కాలనీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశంలో వైఎస్సార్ సీపీ క్లీన్ స్వీప్ చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలుత స్థానిక ఎఫ్‌సీఐ గోడౌన్ ఎదురుగా ఉన్న ప్రాంతంలో ఈ దఫా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం 17వ డివిజన్ అంబేడ్కర్ కాలనీకి చేరుకుని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు తమకు పథకాలు అందుతున్న తీరును బాలినేనికి వివరించారు. తప్పకుండా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుంటామన్నారు. ఎమ్మెల్యే బాలినేని మీడియాతో మాట్లాడుతూ ప్రజల నుంచి లభిస్తున్న అపూర్వ ఆదరణ అద్వితీయం అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12/12 సీట్లు గెలుచుకుంటామని, రాష్ట్రంలో 135కిపైగా అసెంబ్లీ సీట్లను తమ పార్టీకై వసం చేసుకుంటుందన్నారు. ఈనెల 9న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మ్యానిఫెస్టో విడుదల చేస్తారని, మ్యానిఫెస్టో విడుదల చేయగానే మళ్లీ ప్రజలకు వాటి వివరాలు తెలియజేస్తామన్నారు. చంద్రబాబు మ్యానిఫెస్టో అంటే బూటకపు హామీలు మాత్రమే అని, 2014 ఎన్నికలకు ముందు ప్రకటించిన మ్యానిఫెస్టోలో ఎన్ని హామీలు నెరవేర్చారో ప్రజలు గమనించాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చెప్పాడంటే చేస్తాడంతే అనే నమ్మకం ప్రజల్లో స్పష్టంగా ఉందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం పథకాలు పూర్తిచేశారని, అందుకే ధైర్యంగా ప్రజల్లోకి ఓటు అడిగేందుకు వస్తున్నామన్నారు. ఒంగోలు నగరంలో శాశ్వత మంచినీటి పథకానికి రూ.339 కోట్ల నిధులు మంజూరై టెండర్లు పూర్తయి సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన కూడా జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ దఫా ఎన్నికల్లో గెలిచిన తరువాత నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం ప్రథమ ప్రాధాన్యతగా పూర్తిచేస్తామని చెప్పారు. నగరంలో 20840 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినా ఇంకా కొంతమంది అర్హులై ఉండి కూడా ఇళ్ల పట్టాలకు దరఖాస్తు చేసుకోలేదన్నారు. ఇప్పటికైనా వారు దరఖాస్తు చేసుకుంటే వారికి రెండో విడతలో ఇళ్లపట్టాలు మంజూరు చేస్తారన్నారు. రెండో విడతలో ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు సేకరించిన భూమి సైతం సిద్ధంగా ఉందన్నారు. టీడీపీ అభ్యర్థి మాత్రం దొంగపట్టాలు అంటూ సిగ్గులేకుండా మాట్లాడడం సరికాదన్నారు. ప్రజలను మోసపుచ్చే మాటలు చెప్పడం మానుకుని వాళ్ల ప్రజలకు ఏం చేశారో చెప్పుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షులు కటారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతి రావు, మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షులు తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, 17వ డివిజన్ కార్పొరేటర్ నాగం వెంకట శేషయ్య, డివిజన్ అధ్యక్షుడు నాగం వెంకట్రావు, గొర్రెపాటి, పత్రా బంగారం, బొమ్మనేని మురళి, గంటా రామానాయుడు, వర్ధుశేషయ్య, దుగ్గిరెడ్డి ఆంజనేయరెడ్డి, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, మేదర కార్పొరేషన్ చైర్మన్ కేతా లలిత నాంచారమ్మ, కృష్ణ బలిజ, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్లు తిర్లిక శ్రీనివాసరావు, దాసరి కరుణాకర్, ఆగ్రోస్ కార్పొరేషన్ డైరెక్టర్ పురిణి ప్రభావతి, మహిళా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లీలా కుమారి, కావూరి సుశీల, రాజిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పత్రా బంగారం, పికిలి శ్రీనివాసరావు, ఆనం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

12న ఈవీఎంల ర్యాండమైజేషన్

- ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన చర్యలు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్



కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వచ్చే నెల 12వ తేదీ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల మొదటి విడత ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా మే 2వ తేదీ ఎన్నికల పరిశీలకులు, పోటీచేస్తున్న అభ్యర్థుల సమక్షంలో రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. శనివారం ప్రకాశం భవనంలోని కమాండ్ కంట్రోల్ రూములో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ఏర్పాట్లు, తీసుకుంటున్న చర్యలు, జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై వివరించారు. జిల్లాలో ఈ నెల 28వ తేదీ నాటికి మొత్తం 18,14,371 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో నమోదు కోసం వచ్చిన దరఖాస్తులు ఈ నెల 16వ తేదీ నాటికి 5457 పెండింగ్ ఉన్నట్లు చెప్పారు. జిల్లాలో 3,30,516 ఫొటో ఓటరు గుర్తింపు కార్డులు రాగా వాటిలో 2,82,923 కార్డులు రిజిస్టర్ పోస్టు ద్వారా ఇప్పటికే ఓటర్లకు పంపామన్నారు. ఒంగోలులోని రైజ్ కాలేజీలో రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఐదు నియోజకవర్గాలకు సంబంధించి ప్రత్యేకంగా మధ్యంతర స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యర్రగొండపాలెం నియోజకవర్గానికి మార్కాపురంలో గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా దర్శి, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాలకు స్థానికంగానే మధ్యంతర స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా స్థాయిలో పలువురు అధికారులను నోడల్ అధికారులుగా నియమించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి జిల్లాకు సంబంధించి 29 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిలో 25 పరిష్కరించి నివేదిక పంపామన్నారు. మిగిలిన వాటిపై పరిశీలన జరుగుతుందని చెప్పారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్లు పత్రికల్లో 84 వార్తలు రాగా వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకున్నామన్నారు. ఒక రెగ్యులర్ ఉద్యోగితో పాటు ఏడుగురు కాంట్రాక్టు ఉద్యోగులు, 20 మంది వలంటీర్లు, ఇద్దరు రేషన్ డీలర్లపై చర్యలు తీసుకున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించి వినియోగించుకునేందు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. సువిధ యాప్ ద్వారా అనుమతులు కోరుతూ 334 అర్జీలు రాగా వాటిలో 211 అర్జీలను ఆమోదించామని చెప్పారు. ఎన్నికల ఖర్చు, ప్రలోభపెట్టే డబ్బు, ఇతర వస్తువుల రవాణాను అడ్డుకునేందుకు 24 ఎఫ్ఎస్‌టీ, 40 వీఎస్‌టీ, 25 ఎస్ఎస్‌టీ, 9 వీవీటీ, 9 అకౌంటింగ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు 9 ఏఈఓ బృందాలు, 50 ఎంసీసీ బృందాలు, 263 సెక్టార్ ఆఫీసర్‌లను నియమించామని చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో రాజకీయ పార్టీలు రూ.18,54,500 ఎన్నికల ప్రచారానికి ఖర్చు చేశాయన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేలా తరలిస్తున్న రూ.75,46,985 విలువైన నగదు, వస్తువులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. జిల్లాలో మొత్తం 2183 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో 486 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. సీఓలు, ఏపీఓలకు ఏప్రిల్ 5, 7 తేదీల్లో మొదటి విడత శిక్షణ ఇస్తున్నామన్నారు. దీనిలో డీఆర్‌ఓ శ్రీలత, సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, వివిధ విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీలోకి ముస్లిం కుటుంబాలు

● పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన బాలినేని, చెవిరెడ్డి


టీడీపీ నుంచి వైఎస్సార్‌ సీపీలో చేరుతున్న ముస్లింలను స్వాగతిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి

ఒంగోలు: నగరంలోని ఇస్లాంపేటలో టీడీపీకి చెందిన 20 ముస్లిం కుటుంబాలు శనివారం సాయంత్రం వైఎస్సార్‌ సీపీలో చేరాయి. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చేరిన వారికి స్థానిక బాలినేని నివాసంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, పార్టీ రీజినల్‌ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలినేని, చెవిరెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరి సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు పరిపాలన సాగించిందన్నారు. ఆ విషయాన్ని గుర్తించి పార్టీలో చేరుతున్న ముస్లింలను అభినందించారు. 1983 నుంచి టీడీపీ జెండా తప్ప మరో జెండా పట్టని నిస్సార్‌ సైతం వైఎస్సార్‌ సీపీలో చేరడంతో టీడీపీకి ఇస్లాంపేటలో షాక్‌ తగిలింది. ఈ సందర్భంగా నిస్సార్‌ మాట్లాడుతూ ఇటీవల బీజేపీ పూర్తిస్థాయిలో ముస్లింల మనోభావాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండటంతో తాను తీవ్రంగా మదనపడినట్లు తెలిపారు. బీజేపీ తీసుకొచ్చిన సీఏఏ చట్టం వల్ల ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ పతనం ఖాయమన్నారు. 40 సంవత్సరాలపాటు టీడీపీలో ఉన్నప్పటికీ ఎటువంటి ఉపయోగం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ అందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని భావిస్తూ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డితోనే ముస్లింల అభివృద్ధి సాధ్యమని భావించి వైఎస్సార్‌ సీపీలో చేరినట్లు తెలిపారు. నిస్సార్‌తో పాటు షేక్‌ మన్సూర్, షేక్‌ మునాఫ్, షేక్‌ యగ్బాల్, షేక్‌ అష్రఫుల్లా, షేక్‌ ఇబాదుల్లా, కె.చంద్రబోస్, షేక్‌ మహబూబ్‌బాషా, షేక్‌ ఫజుల్లా, షేక్‌ నాగూర్, షబ్బీర్, వారి మిత్రబందం, అబ్దుల్లా, కరిముల్లా కలిపి మొత్తం 20 ముస్లిం కుటుంబాలు వైఎస్సార్‌ సీపీలో చేరాయి. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని వారంతా స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ మైనార్టీ సెల్‌ జిల్లా, నగర అధ్యక్షులు సయ్యద్‌ జలీల్, షేక్‌ మున్నా, బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేవా.. దామచర్ల బానిసవా..?

● కొండపి ఎమ్మెల్యే స్వామిని నిలదీసిన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి సురేష్


భవన నిర్మాణ కార్మికుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

సింగరాయకొండ (మర్రిపూడి): నువ్వు ఎమ్మెల్యేవా.. లేకుంటే దామచర్లకు కట్టుబానిసవా అని కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌ ప్రశ్నించారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి వలస వెళ్లిన భవన నిర్మాణ కార్మికులతో హైదరాబాద్‌లోని బాలానగర్‌లో శనివారం ఉదయం మంత్రి సురేష్‌ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపిలో తనకు ప్రత్యర్థి ఎమ్మెల్యే స్వామి కాదని.. దామచర్ల పూర్ణచంద్రరావు, దామచర్ల సత్య అని అన్నారు. ఎమ్మెల్యే స్వామి కేవలం దామచర్ల ఇంటి కట్టుబానిస అని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లయినా ఎమ్మెల్యే స్వామికి మాత్రం ఇంకా స్వాతంత్ర్యం రాలేదని ఎద్దేవా చేశారు. ఆయన ఏం చేయాలన్నా దామచర్ల కుటుంబ ఆదేశాల కోసం ఎదురుచూపులు చూస్తూ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌ సీపీ పెత్తందార్లతో పోరాటం చేస్తుంటే ఎమ్మెల్యే డోలా మాత్రం ఆ పెత్తందార్ల పంచన చేరి ఊడిగం చేస్తున్నాడని ఆరోపించారు. ఎమ్మెల్యేగా స్వామిని రెండుసార్లు గెలిపించినా ఆయన వల్ల నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదని, ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని అన్నారు. నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పించి ప్రజలకు తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి సురేష్‌ హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమ ప్రదాత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని ప్రశంసించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలను జన్మభూమి కమిటీల ఆదేశాల ప్రకారం ఇచ్చారని, అది కూడా టీడీపీకి చెందిన వారికే ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన పేదలందరికీ సచివాలయ, వలంటీర్‌ వ్యవస్థల ద్వారా పథకాలు అందించారని వివరించారు. పథకాల ద్వారా రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని విమర్శించిన చంద్రబాబు.. ఇప్పుడేమో ఓట్ల కోసం అలవికాని హామీలిస్తున్నారని, గెలిచినా అవేమీ అమలు చేయరని, అందుకే ప్రజలు వాటిని నమ్మవద్దని కోరారు. నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ వంటి ప్రధాన సమస్యలున్నాయని, వాటి పరిష్కారానికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాను ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన మూడు నెలల్లోనే ఎన్నో అభివృద్ధి పనులు చేశానని, రూ.1.15 కోట్ల సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులు అందజేశానని, విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్య తీర్చానని, విద్యుత్‌ స్తంభాలు ఏర్పాటు చేశానని, అవసరమైన చోట్ల బోర్లకు మరమ్మతులు చేయించానని, కొత్త బోర్లను సొంత నిధులతో వేయించానని వివరించారు. మూడు నెలల కాలంలో ఇంత చేస్తే.. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ రూపురేఖలు ఎలా మారతాయో అర్థం చేసుకోవాలని కోరారు. ప్రజలంతా ఫ్యాన్‌ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించాలని మంత్రి సురేష్‌ కోరారు. అందరూ పోలింగ్‌కు స్వగ్రామాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ సానుభూతిపరులు, నాయకులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమంతో ప్రతి ఇంటికీ మేలు


చీమకుర్తిలో ప్రచారం చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

● పథకాలను గుర్తు పెట్టుకుని ఫ్యాన్‌ గుర్తుకు ఓటేయండి
● జగనన్నను మళ్లీ సీఎం చేసుకోండి
● వైఎస్సార్‌ సీపీ సంతనూతలపాడు ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున విజ్ఞప్తి

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి మేలు కలిగించాయని వైఎస్సార్‌ సీపీ సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. శనివారం చీమకుర్తి పట్టణంలోని 19వ వార్డులో స్థానిక కౌన్సిలర్లు గంగిరెడ్డి ఇందిర సుందర రామిరెడ్డి, పాలపర్తి వెంకట్రావుతో పాటు పార్టీ పట్టణ కన్వీనర్‌ క్రిష్టిపాటి శేఖరరెడ్డితో కలిసి మంత్రి మేరుగు నాగార్జున ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ఓటర్లతో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన పథకాలను గుర్తు పెట్టుకుని మే నెల 13వ తేదీ జరగనున్న ఎన్నికలలో సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్‌ సీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను గెలిపించాలని మేరుగు నాగార్జున విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు అందుతున్న సంక్షేమ పథకాలు మళ్లీ నిరంతరం లబ్ధిదారులకు అందాలంటే వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంని చేసుకుందామన్నారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల వలన కలిగిన ప్రయోజనాలపై ఆరా తీస్తూ పార్టీ గుర్తుతో కూడిన కరపత్రాలను అందిస్తూ ఓటర్లకు అభివాదం చేస్తూ మంత్రి నాగార్జున నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ బాపతు వెంకటరెడ్డి, సోమా శేషాద్రి, గోపురపు చంద్ర, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, పాలడుగు సుబ్బారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొనగానివారిపాలెంలో మంత్రి మేరుగు ప్రచారం...

సంతనూతలపాడు మండలం కొనగానివారిపాలెంలో శుక్రవారం రాత్రి మంత్రి మేరుగు నాగార్జున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌ సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని, ఓటర్లకు అందించిన సంక్షేమ పథకాలను గుర్తు చేస్తూ సంతనూతలపాడు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, దుంపా యలమందారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆదరించండి..అండగా నిలుస్తా...

మద్దిపాడు: సంతనూతలపాడు నియోజకవర్గ ప్రజలు తనను ఆదరిస్తే అండగా నిలుస్తానని, పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు సైతం మేలు చేస్తానని మేరుగు నాగార్జున అన్నారు. శనివారం సాయంత్రం మద్దిపాడు, ఎస్సీకాలనీ, బీసీ కాలనీలలో ఆయన పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు పార్టీలు, కుల, మత, ప్రాంతీయ బేధాలు లేకుండా అర్హులందరికీ వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం పథకాలు అందించిందని వివరించారు. మంచి చేసిన వారిని ప్రజలు గుర్తు పెట్టుకుని ఓట్లు వేయాలని కోరారు. జగన్‌ లాంటి స్థిరమైన నాయకుడు లేకపోతే రాష్ట్రం అసమర్థుల పాలవుతుందన్నారు. కప్పదాట్లు వేసే చంద్రబాబుకు, సీఎం జగన్‌కు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. దత్తపుత్రుడు, ఉత్తపుత్రుడుతో కలిసి రాష్ట్రానికి చంద్రబాబు చేసేదేమీ లేదన్నారు. మద్దిపాడు ఎస్సీకాలనీలో మంత్రికి శాలువాలు, పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి, మరో కార్యదర్శి మోరబోయిన సంజీవరావు, వైస్‌ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, సీనియర్‌ నాయకులు సంజీవరావు, గుడ్డపాతల రవి, ఓబులరెడ్డి, వెల్లంపల్లి మాజీ సర్పంచ్‌ జయమ్మ, అనిల్, గ్రామ సర్పంచ్‌ మద్దిరాల వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, ప్రభుదాసు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ గెలిచేది వైఎస్సార్‌ సీపీనే!


కాట్రగుంటలో మహిళలతో మాట్లాడుతున్న అన్నా

● ఎన్నికల ప్రచారంలో పార్టీ అభ్యర్థి 'అన్నా'

కొనకనమిట్ల: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో, మార్కాపురంలోనూ వైఎస్సార్‌ సీపీ జెండా రెపరెపలాడుతుందని మార్కాపురం నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కాట్రగుంట, తన్నీరువారిపల్లి, ఓబులరెడ్డిపల్లి, కుమ్మరిపల్లి, పేరారెడ్డిపల్లి, వెంగళపల్లి, గరిమినపెంట, నడింపల్లి, పాతపాడు, ఇరసలగుండం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఓటర్లకు అభివాదం చేస్తూ మళ్లీ అందరికీ సంక్షేమ ఫలాలు అందాలంటే ఫ్యాన్‌ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌ సీపీ తరఫున మార్కాపురం నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తొలుత ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో పాల్గొన్న అన్నా మాట్లాడుతూ వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ప్రవేశపెట్టి, అమలు చేసిన సంక్షేమ పథకాలే తమకు విజయం చేకూరుస్తాయన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. ఉత్సాహంగా సాగిన అన్నా ఎన్నికల ప్రచారంలో మహిళలు హారతులిచ్చి మళ్లీ వైఎస్సార్‌ సీపీనే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తూ అన్నాకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్‌ ఎంపీపీలు మెట్టు వెంకటరెడ్డి, గొంగటి జెనీఫా కరుణయ్య, మండల పార్టీ కన్వీనర్‌ మోరా శంకర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్‌ సూరవరపు పెదవెంకటరెడ్డి, మండల సమన్వయకర్త ఉడుముల గురవారెడ్డి, రామనారాయణరెడ్డి, ఎస్సీ సెల్‌ జిల్లా నాయకులు చిరుగూరి కోటేశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు దొంతిరెడ్డి జయమ్మ చినరామిరెడ్డి, గోపిరెడ్డి ఓబులరెడ్డి, ఎంపీటీసీ కరేటి నాగలక్ష్మి, పార్టీ నాయకులు గంగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రాజాల వెంకటేశ్వరరెడ్డి, కందెర పెద్దన్న, గోనుగుంట బ్రహ్మయ్య చౌదరి, చల్లా వెంకటేశ్వర్లు చౌదరి, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, గుంటక నారయణ, పెదరామిరెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు కంకణాల రమేష్, గోనుగుంట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాబుకు రోజులు దగ్గర పడ్డాయి


నిరసన తెలుపుతున్న దళిత క్రైస్తవులు

● ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్

దర్శి: దళితుడైన టిప్పర్‌ డ్రైవర్‌ శింగనమల వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆంజనేయులుపై చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలు తగవని, చంద్రబాబుకు రోజులు దగ్గర పడ్డాయని ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్‌ మండి పడ్డారు. వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద దళిత క్రైస్తవ, బీసీ నాయకులు చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసన తెలిపారు. ఈసందర్భంగా దేవ ప్రసాద్‌ మాట్లాడుతూ చంద్రబాబుకు దళితులంటే మొదటి నుంచి అలుసని చెప్పారు. దళితుల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని కించపరిచిన వ్యక్తి అన్నారు. జగనన్న గొప్ప వ్యక్తి వ్యక్తి కాబట్టే.. నిజాయతీపరుడు, పేద దళితుడైన శింగనమల వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆంజనేయులును నియమించారన్నారు. జగనన్న సీటు ఇవ్వడాన్ని అవహేళన చేస్తూ చంద్రబాబు మాట్లాడిన తీరు చూస్తే దళితుల పట్ల, మాదిగల పట్ల ఎంత చులకన భావం ఉందో అర్థం అవుతుందన్నారు. టిప్పర్‌ డ్రైవర్‌ని అసెంబ్లీకి పంపాలనుకోవడం జగనన్న చేసిన తప్పా అని ప్రశ్నించారు. డ్రైవర్లంతా జగనన్న చేసిన మంచి పని, చంద్రబాబులో ఉన్న పేద దళితులు, శ్రామికుల పట్ల చులకన భావాన్ని డ్రైవర్లంతా ఖండించాలన్నారు. సీట్లు అమ్ముకుని ధనవంతులను నిలబెట్టి డబ్బుతో గెలవాలనుకునే చంద్రబాబు నీచ రాజకీయ బుద్ధి ఆయన మాటల్లోనే స్పష్టం చేశారన్నారు. టిప్పర్‌ డ్రైవర్‌.. టిప్పర్‌ డ్రైవర్‌ అంటూ పదే పదే అంటూ హేలనగా మాట్లాడిన చంద్రబాబుకు అడుగు తీసి పెట్టాలన్నా డ్రైవర్‌ కావాలన్నారు. డ్రైవర్‌ లేకుండా అడుగు కూడా ముందుకెయ్యని నువ్వు.. నీడ్రైవర్‌ కూడా చీదరించుకునే పరిస్థితి ఉందన్నారు. మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం మాట్లాడుతూ చంద్రబాబు వ్యాఖ్యల్లో పేదలంటే ఎంత చిన్న చూపో చిన్నపిల్లవాడికి కూడా తెలిసిపోయిందన్నారు. నీ మాటలకు నిజంగా మానవత్వం ఉంటే నీదగ్గర పని చేసే డ్రైవర్లు కూడా నీకు ఓట్లు వేసే పరిస్థితి లేదన్నారు. నీమాటలు రాష్ట్రంలో ఉన్న ఆటో, కారు, బస్, లారీ, ఇతర వాహనాల డ్రైవర్లందరి మనోభావాలు, ముఖ్యంగా దళితుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీడ్రైవర్‌ రెండు సెకెన్లు కన్ను రెప్ప మూస్తే పాతాళంలో ఉంటావని గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు. ప్రముఖ దళిత క్రైస్తవ నాయకుడు గుంటూరి కృపానందం మాట్లాడుతూ చంద్రబాబు వ్యాఖ్యలకు రాష్ట్రంలో లక్షలాది మంది దళితులు, డ్రైవర్‌ వృత్తిలో ఉన్న అందరి మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. సింగనమల వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆంజనేయులు కాళ్ళు పట్టుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని చంద్రబాబును డిమాండ్‌ చేశారు. విద్యావంతుడైన అంజనేయులుకు చంద్రబాబు హయాంలో ఉద్యోగం లేక టిప్పర్‌ డ్రైవర్‌గా వెళ్ళాడని జగనన్న మంచి వ్యక్తి అని గుర్తించి పేదవాడైనా ఎమ్మెల్యే టికెట్‌ ఇచ్చి రాష్ట్రంలోని డ్రైవర్‌లందరికీ గౌరవం తీసుకువచ్చారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుధా అచ్చయ్య, మార్కెట్‌ యార్డ్‌ చైర్మన్‌ షేక్‌ షకీలా అమీన్‌ బాషా, రాచపూడి భాస్కర్, క్రైస్తవ సంఘ నాయకులు జి. ఏసుదాసు, ఎన్‌. ఏసన్న, ఆలూరి రమేష్, రాచపూడి డేవిడ్, శ్రీరాం ఏసుబాబు, జి. రాజారత్నం, తుళ్లూరి బాబురావు, గర్నెపూడి సామ్యేల్, కుంటా అచ్చారావు, గర్నెపూడి రాజేష్, కొడవటి జాన్‌ పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి జారిపడి సచివాలయ ఉద్యోగి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పట్టణ ఎస్సై అబ్దుల్‌ రెహమాన్‌

మార్కాపురం టౌన్‌: బాత్‌ రూంలో నీళ్ల బయటకు పంపే క్రమంలో కాలుజారి మిద్దెపై నుంచి పడిన సచివాలయ ఉద్యోగి మృతి చెందిన ఘటన శనివారం మార్కాపురం పట్టణంలోని పంచాయతీ రాజ్‌ గెస్టు హౌస్‌ సమీపంలో జరిగింది. పట్టణ ఎస్సై అబ్దుల్‌ రెహమాన్‌ కథనం ప్రకారం.. పంచాయతీ రాజ్‌ గెస్టుహౌస్‌ సమీపంలో ఉన్న 12వ సచివాలయంలో వార్డు వెల్ఫేర్‌ అసిస్టెంట్‌గా నంద్యాల జిల్లా నున్నిపెంటకు చెందిన బేతం మల్లయ్య (28) పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం నిద్రలేచి బాత్‌రూములోని నీళ్ల ఓపెన్‌ ప్లేసులోకి రావడంతో ఆ నీటిని బయటకు పంపే క్రమంలో ముందుకు చూస్తూ ప్రమాద వశాత్తు మూడో అంతస్తు నుంచి జారిపడటంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. సమీపంలో ఉన్న వారు గమనించి జిల్లా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.